



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

బుధవారం,
జనవరి 22, 2025

సంపుటి : 10 సంచిక :14 రంగారెడ్డి ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ పేజీలు 8 వెల 4/-




## తెలంగాణలో

# యూనీలీవర్ పెట్టుబడులు

**పామాయిల్ ఫ్యాక్టరీ, రిఫైనింగ్ పరిశ్రమ విస్తరణ**

**కొత్తగా సీసా మూతల యూనిట్ ఏర్పాటుకు సిద్ధం..**

**దావోస్ సదస్సులో రాష్ట్ర ప్రభుత్వ తొలి ఒప్పందం కామారెడ్డిలో స్థలం ఇస్తామన్న సీఎం..**

**మెఘా రూ.15 వేల కోట్ల పెట్టుబడులు.. 3 ఒప్పందాలు..**

**పలువురు పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్చలు**

హైదరాబాద్, జనవరి 21 : దావోస్‌లో పెట్టుబడుల సాధనలో తెలంగాణ ప్రభుత్వం బోణీ కొట్టింది. విస్తరణ ప్రణాళికలో భాగంగా తెలంగాణలో రెండు తయారీ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని యూనీ లీవర్ కంపెనీ తెలిపింది. తెలంగాణలో పామాయిల్ ఫ్యాక్టరీ, రిఫైనింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామనిబీ సీసా మూతలు ఉత్పత్తి చేయడానికి కొత్త తయారీ యూనిట్ పెడతామని ప్రకటించింది. యూనీ లీవర్ ఉత్పత్తులు ఎక్కువగా ద్రవ రూపంలో సీసాల్లో అమ్ముడవుతున్నాయి. ప్రస్తుతం బాటిల్ క్యాప్‌లను ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. రాష్ట్రంలోనే సీసా మూతలను ఉత్పత్తి చేస్తే దిగుమతి అవసరం ఉండదని కంపెనీ తెలిపింది. పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చిన యూనీ లీవర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. ప్రభుత్వం తరపున అవసరమైన సహకారం అందిస్తామని, కామారెడ్డి జిల్లాలో తగిన స్థలాన్ని కేటాయిస్తామని స్పష్టం చేశారు. దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ బృందం మంగళవారం పలువురు పారిశ్రామికవేత్తలతో సమావేశమైంది. పెట్టుబడుల ఆకర్షణకు

(మిగతా 2వ పేజీలో)



## 16 మంది

# మావోయిస్టులు మృతి

**మృతుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి.. కీలక నేతలు ఉన్నట్లు ప్రచారం**

**సోమవారం ఉదయమే మొదలైన ఎన్‌కౌంటర్.. దశల వారీగా ఎదురుకాల్పులు**

**తొలిరోజున ఇద్దరు..రెండో రోజు 14 మంది మృతదేహాలు లభ్యం**

**ఇంకా కొనసాగుతున్న బలగాల కూంబింగ్**

**25 నుంచి 30 మంది వరకు మావోయిస్టులు మృతిచెంది ఉండొచ్చనే అంచనాలు**

**కాంకేర్ ఎన్‌కౌంటర్ జరిగి వారం తిరగకముందే మరో ఎదురుదెబ్బ**

# మళ్లీ త్రిసభ్య కమిటీకే..

**కృష్ణా జలాల తాత్కాలిక పంపిణీ బాధ్యత అప్పగింత**

**'66:34' కేటాయింపులను వ్యతిరేకించిన తెలంగాణ**

**ఏపీ ఈ ఏడాది ఇప్పటికే 76% నీళ్లు వాడిందని అభ్యంతరం**

**వాడీవేడిగా కృష్ణా బోర్డు భేటీ**



హైదరాబాద్: కృష్ణా జలాల తాత్కాలిక సర్దుబాటు బాధ్యతను మళ్లీ త్రిసభ్య కమిటీకే అప్పగిస్తూ కృష్ణానది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) నిర్ణయం తీసుకుంది. దీనికి ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు అంగీకరించాయి. మంగళవారం హైదరాబాద్‌లోని జలసౌధలో బోర్డు చైర్మన్ అతుల్‌జైన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలంగాణ తరపున నీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా, ఈఎన్‌సీ జి.అనిల్‌కుమార్, అంతర్రాష్ట్ర జలవనరుల విభాగం ఎస్‌ఈ విజయ్‌కుమార్, ఏపీ జలవనరుల శాఖ ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, బోర్డు సభ్యకార్యదర్శి డీఎం రాయ్‌పురే పాల్గొన్నారు. కృష్ణా జలాల్లో ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీల వాటా ఉండగా, 66:34 నిష్పత్తిలో ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలను తాత్కాలిక సర్దుబాటు పేరుతో 2015 జూన్‌లో కేంద్ర జలశక్తి శాఖ జరిపిన కేటాయింపులను ఇకపై కొనసాగించడానికి అంగీకరించమని రాహుల్ బొజ్జా తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే త్రిసభ్య కమిటీ ఈసారి తెలంగాణకు కొంత వరకు కేటాయింపులు పెంచుతుందని బోర్డు చైర్మన్ హామీ ఇచ్చారని రాహుల్‌'జ్జా తెలిపారు. సమావేశానంతరం ఈఎన్‌సీ జి.అనిల్‌కుమార్‌తో కలిసి ఆయన మీడియాకు ఆ వివరాలు

(మిగతా 2వ పేజీలో)



# గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకోండి

**అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు**

**రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు నిరంతర ప్రక్రియ**

**కలెక్టర్లతో సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి, ఇతర మంత్రుల వెల్లడి**

**ఈనెల 24 వరకు గ్రామ సభల నిర్వహణ**

హైదరాబాద్: రాష్ట్రంలో అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో సహా పలువురు మంత్రులు స్పష్టం చేశారు. రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు అనేది నిరంతర ప్రక్రియ అని, ఈ పథకాలకు ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోనివారు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఈనెల 24 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న గ్రామ సభలు, వాటిలో నాలుగు పథకాలకు సంబంధించి ప్రజల స్పందన తదితర అంశాలపై కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అనసూయ,

(మిగతా 2వ పేజీలో)

# జనసేనకు ఈసీ గుర్తింపు

**ఇక గాజుగ్లాసు గుర్తు ఆ పార్టీకే**

**పవన్ కల్యాణ్‌కు ఎన్నికల సంఘం లేఖ**




# 5న కుంభమేళాలో మోదీ పుణ్యస్నానం



న్యూఢిల్లీ: అశేష భక్త జనవాహిని తరలివస్తోన్న ప్రయాగ్‌రాజ్‌లోని కుంభమేళాలో ప్రధాని నరేంద్ర మోదీ సైతం పాల్గొనబోతున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఫిబ్రవరి ఐదో తేదీన ప్రధాని మోదీ త్రివేణి సంగమ స్థలిలో పుణ్యస్నానం ఆచరిస్తారని ఆయా వర్గాలు మంగళవారం తెలిపాయి. మరోవైపు ఈనెల 27వ తేదీన కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా త్రివేణి సంగమంలో పవిత్రస్నానం ఆచరించనున్నారు. గంగా హారతి కార్యక్రమంలోనూ పాల్గొంటారు. అధికారులతో భేటీ కానున్నారు. అమిత్ షా వారంరోజుల్లో వస్తుండటంతో కుంభమేళాలో భద్రతను మరోసారి సమీక్షించారు. ప్రధాన కూడళ్ల వద్ద మరోసారి తనిఖీలుచేశారు. ఫిబ్రవరి ఒకటో తేదీన ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ఫిబ్రవరి 10వ తేదీన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రయాగ్‌రాజ్‌కు రానున్నారు. నగరంలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. దట్టంగా పొగమంచు కమ్ముకున్నాసరే భక్తులు మంగళవారం సైతం భారీస్థాయిలో పుణ్యస్నానాలు ఆచరించారు. జనవరి 13న మొదలైన కుంభమేళా ఫిబ్రవరి 26వ తేదీన పూర్తికానుంది. మౌని అమావాస్య (రెండో షాహీ స్నానం) వచ్చే జనవరి 29న , ఫిబ్రవరి మూడో తేదీన వసంత పంచమి రోజు (మూడో షాహీ స్నానం), ఫిబ్రవరి 12న (మాఘ పూర్ణిమ) అధిక సంఖ్యలో జనం రావచ్చు. ఫిబ్రవరి 26న మహాశివరాత్రితో కుంభమేళా ముగుస్తుంది. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర గణాంకాల ప్రకారం జనవరి 20నాటికి 8.81 కోట్ల మందికిపైగా భక్తులు పుణ్య స్నానాలు చేశారు.

## కాంగ్రెస్ ప్రభుత్వానిది ముమ్మాటికీ ప్రజా వ్యతిరేకపాలనే



**ఏడాది పాలన పెద్ద ఫెయిల్యూర్**

**ప్రజలు ఉద్యమించక ముందే కళ్లు తెరవండి:**

**మాజీ మంత్రి హరీశ్**

### రియల్టర్ అనుచరుడిపై

# ఎంపీ ఈటల దాడి

**ప్లాట్లు కొన్నవారిని ఇబ్బంది పెడుతున్నారంటూ కొట్టిన వైనం**

**ఆపై దాడికి దిగిన ఎంపీ అనుచరులు.. ఇద్దరికి గాయాలు**

**పోలీసులకు బాధితుల ఫిర్యాదు.. ధర్మాన్ని కాపాడేందుకే: ఈటల**



# తెలంగాణలో యూనీలీవర్ పెట్టుబడులు

ఏర్పాటు చేసిన తెలంగాణ పెవిలియన్లో యూనీ లీవర్ సీఈవో హీన్ షూ మేకర్, చీఫ్ సప్లయ్ చైన్ ఆఫీసర్ విల్లెం ఉయిజెన్‌తో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు చర్చలు జరిపారు. వినియోగ వస్తువుల తయారీలో ప్రపంచ దిగ్గజ కంపెనీగా యూనీలీవర్‌కు పేరుంది. మన దేశంలో హిందుస్థాన్ లీవర్ పేరిట వ్యాపారాలు నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణలో ఉన్న వ్యాపార అవకాశాలను సీఎం రేవంత్ వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అవకాశాలు, నైపుణ్యమున్న మానవ వనరులు, ప్రభుత్వ ప్రోత్సాహాలను తెలిపారు. దక్షిణ భారత దేశంలోని అన్ని రాష్ట్రాలకూ తెలంగాణ వారధిగా ఉంటుందని, అనుకూల వాతావరణంతోపాటు తూర్పు, పడమరన ఉన్న మిగతా రాష్ట్రాలకు ముఖ ద్వారంగా ఉంటుందని అన్నారు. తెలంగాణలో వినియోగ వస్తువులకు భారీ మార్కెట్ ఉందని, సులభతర వ్యాపార విధానాలు అదనపు బలమని చెప్పారు. తెలంగాణ రైజింగ్ 2050 విజన్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఎంచుకున్న భవిష్యత్తు ప్రణాళిక ప్రపంచంలో అత్యుత్తమంగా అందరినీ ఆకర్షిస్తోందన్నారు. దాంతో, తెలంగాణలో వ్యాపారాల విస్తరణకు, కొత్త యూనిట్ ఏర్పాటుకు యూనీ లీవర్ ముందుకొచ్చింది. ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎంవో ప్రధాన కార్యదర్శి వి.శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, పెట్టుబడుల ప్రోత్సాహ విభాగం ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

### స్కైరూట్ రూ.500 కోట్ల పెట్టుబడులు

తెలంగాణలో ప్రైవేట్ రాకెట్ తయారీ, ఇంటిగ్రేషన్ అండ్ టెస్టింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామని ప్రైవేటు రంగంలో తొలి అంతరిక్ష ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించిన స్కైరూట్ కంపెనీ ప్రకటించింది. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఈ కంపెనీ వ్యవస్థాపకుడు పవన్ కుమార్ చందన దావోసలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నారు. ఒప్పందం ప్రకారం.. తెలంగాణలో ఇంటిగ్రేటెడ్ ప్రైవేట్ రాకెట్ తయారీ, ఇంటిగ్రేషన్ మరియు టెస్టింగ్ యూనిట్‌ను స్కైరూట్ ఏర్పాటు చేస్తుంది. ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు రూ.500 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ ఒప్పందంపై సీఎం రేవంత్ ఆనందం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌కు చెందిన సంస్థ అత్యాధునిక సాంకేతిక రంగంలో విజయం సాధించటం గర్వంగా ఉందన్నారు. స్కైరూట్‌తో ప్రభుత్వ భాగస్వామ్యం అంతరిక్ష రంగంపై తమ వ్యూహాత్మక దృష్టిని చాటిచెబుతుందన్నారు. త్వరలోనే హైదరాబాద్‌ను ప్రైవేట్ రంగ అంతరిక్ష కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా అభివృద్ధి చేస్తామన్నారు. తె లంగాణలో పెట్టుబడులు పెట్టడం తమకు సంతోషంగా ఉందని స్కైరూట్ సహ వ్యవస్థాపకుడు పవన్ కుమార్ చందన అన్నారు. తెలంగాణ రైజింగ్, హైదరాబాద్ రైజింగ్ లక్ష్య సాధనలో భాగం పంచుకుంటామన్నారు.

### పారిశ్రామికవేత్తలతో చర్చలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం సదస్సులో వివిధ కంపెనీల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో సమావేశమైంది. కృత్రిమ మేధ (ఏఐ)తో కూడిన ఉత్పత్తుల్లో ప్రపంచ ఖ్యాతిగాంచిన కాలిఫోర్నియా కేంద్రంగా ఉన్న సాంబానోవా కంపెనీ చీఫ్ గ్రోత్ ఆఫీసర్ సూలేతో చర్చలు జరిపారు. ప్రధానంగా తెలంగాణలో సెమీ కండక్టర్ పరిశ్రమలకు సంబంధించిన పెట్టుబడుల అవకాశాలపై చర్చించారు. కంపెనీతో చర్చలు సానుకూలంగా ముగిశాయని, త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయని అధికారవర్గాలు తెలిపాయి.

### దేశానికి మార్గదర్శకంగా తెలంగాణ: మంత్రి శ్రీధర్‌బాబు

ప్రపంచ ఆర్థిక సదస్సు సమావేశాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. టెక్నాలజీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో హైదరాబాద్ ప్రపంచస్థాయిలో ఖ్యాతి గడించిందని, ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న టీకాల్లో దాదాపు 70 శాతం హైదరాబాద్‌లోనే తయారవుతున్నాయని వెల్లడించారు. దేశంలోనే తలసరి ఆదాయంలో నంబర్-1గా ఉందన్నారు. ప్రభుత్వ పథకాల్లో అత్యాధునిక టెక్నాలజీ వినియోగం, సంక్షేమ పథకాల్లో దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. ప్రత్యామ్నాయ ఇంధన తయారీ పరిశ్రమలు, ఆహారశుద్ధి రంగాల్లో పెట్టుబడులతోపాటు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా నైపుణ్య శిక్షణపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. అంతకుముందు సదస్సు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తెలంగాణ పెవిలియన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర ఆహారశుద్ధి శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ ప్రారంభించారు.

### మెఘా రూ.15 వేల కోట్ల పెట్టుబడులు

తెలంగాణ ప్రభుత్వంతో మెఘా ఇంజనీరింగ్ కంపెనీ 3 కీలక ఒప్పందాలు చేసుకుంది. రాష్ట్రంలో 2,160 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ఇంధన ఉత్పత్తి ప్రాజెక్ట్ ఏర్పాటుకు పరస్పర అవగాహన ఒప్పందం (ఎంవోయూ)పై సంతకాలు చేసింది. దావోస్ సదస్సులో మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో మెఘా కంపెనీ ఎండీ పీవీ కృష్ణారెడ్డి ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ప్రాజెక్టుపై దాదాపు రూ.11 వేల కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. నిర్మాణ దశలో దాదాపు వెయ్యి మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. కార్యకలాపాలు ప్రారంభించిన తర్వాత మరో 250 మందికి అదనంగా ఉద్యోగాలు లభిస్తాయి. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ 2025 లక్ష్య సాధనలో పాలుపంచుకునేందుకు ఈ ప్రాజెక్టు చేపట్టినట్లు మెఘా కంపెనీ అధినేత ప్రకటించారు. అలాగే, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ ప్రాజెక్టు ఏర్పాటుకు మెఘా మరో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా తెలంగాణ అంతటా అత్యాధునిక బ్యాటరీ ఎనర్జీ సిస్టమ్ ప్రాజెక్టును స్థాపించనుంది. ఎంపిక చేసిన ప్రదేశాల్లో 100 ఎంవీహెచ్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ వ్యవస్థను అభివృద్ధి చేస్తుంది. ఇందుకు రూ.3000 కోట్ల పెట్టుబడులకు ముందుకొచ్చింది. దీంతో, రెండేండ్లలో 1000 మందికి ప్రత్యక్షంగా, 3000 మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. ఇక, పర్యాటక రంగంలోనూ పెట్టుబడులకు మెఘా ముం దుకొచ్చింది. అనంతగిరిలో ప్రపంచస్థాయి లగ్జరీ వెల్నెస్ రిసార్ట్ ఏర్పాటుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన మౌలిక సదుపాయాల సంస్థ భాగస్వామ్యంతో రూ.1000 కోట్ల పెట్టుబడి పెడుతుంది. నిర్మాణ దశలోనే దాదాపు రెండు వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తుంది.

# మళ్లీ త్రిసభ్య కమిటీకే..

వెల్లడించారు. కృష్ణానది 71శాతం తెలంగాణలో విస్తరించి ఉన్న నేపథ్యంలో రాష్ట్రానికి 71శాతం, ఏపీకి 29 శాతం జలాలను కేటాయించాలని తాము కృష్ణా ట్రిబ్యునల్%-%2లో వాదనలు వినిపించిన అంశాన్ని బోర్డుకు వివరించామన్నారు. ట్రిబ్యునల్ నిర్ణయం వచ్చే వరకు 50:50 నిష్పత్తిలో తాత్కాలిక పంపిణీ జరపాలని డిమాండ్ చేశామని చెప్పారు. ఏపీ కొత్తగా ప్రతిపాదించిన గోదావరి%-%బనకచర్ల ప్రాజెక్టు వివరాలను అందించాలని కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీలకు కోరామన్నారు.

### ప్రతి చుక్కను లెక్కించాల్సిందే..

పోతిరెడ్డిపాడు ద్వారా కృష్ణా జలాలను ఇతర బేసిన్లకు తరలించడాన్ని అడ్డుకోవాలని బోర్డును కోరామని రాహుల్‌బొజ్జా తెలిపారు. చెన్నైకి తాగునీరు మాత్రమే సరఫరా చేయాలని, సాగునీటి అవసరాలకు తరలించడం అక్రమమని వాదించామన్నారు. ఏటా 200 టీఎంసీలకు పైగా కృష్ణా జలాలను ఏపీ బేసిన్ వెలపలి ప్రాంతాలకు తరలిస్తోందని అభ్యంతరం తెలిపారు. పోతిరెడ్డిపాడు, బనకచర్లతోపాటు ఏపీలోని మొత్తం 11 అవుట్ లెట్ల ద్వారా తరలిస్తున్న ప్రతీ చుక్కను పక్కాగా లెక్కించడానికి 11 టెలీమెట్రీ స్టేషన్లు ఏర్పాటు చేయాలని కోరామని రాహుల్ బొజ్జా తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి, డిండి వంటి అనుమతి లేని ప్రాజెక్టులపై ఏపీ అభ్యంతరం వ్యక్తం చేయగా, ప్రస్తుతం వీటికి నీటి కేటాయింపులు ట్రిబ్యునల్ పరిధిలో ఉందని బదులిచ్చామన్నారు. కృష్ణా ట్రిబ్యునల్-1 ప్రాజెక్టుల వారీగా కాకుండా గంపగుత్తగా నీళ్లు కేటాయించిందని, దీంతో తెలంగాణలోని ప్రాజెక్టులకు అవసరమైన నీళ్లను కేటాయించుకునే హక్కు తమకు ఉంటుందన్నారు.

### సాగర్‌పై సీఆర్‌పీఎఫ్ బలగాల ఉపసంహరణ

నాగార్జునసాగర్ ప్రాజెక్టుపై ఉన్న సీఆర్‌పీఎఫ్ బలగాలను ఉపసంహరించాలని తాము కోరగా, ఏపీ సైతం అంగీకరించిందని రాహుల్‌బొజ్జా తెలిపారు. ఇరు రాష్ట్రాల మధ్య సమన్వయాన్ని పరిశీలించాక 2 నెలల తర్వాత ఉపసంహరిస్తామని బోర్డు చైర్మన్ హామీ ఇచ్చారన్నారు. కృష్ణా జలాల్లో వాటాలు తేలే వరకు శ్రీశైలం, నాగార్జునసాగర్‌లోని తమ కాంపోనెంట్లతోపాటు హైడల్ పవర్ ప్రాజెక్టులను ఇచ్చే ప్రసక్తే లేదన్నారు.

### ప్రమాదంలో శ్రీశైలం

### జలాశయం : తెలంగాణ ఈఎన్‌సీ అనిల్‌కుమార్

శ్రీశైలం జలాశయ ప్లంజ్‌పూల్ (నీళ్లు స్పిల్‌వే గేట్ల నుంచి దూకి కిందకు పడే ప్రాంతం) వద్ద 300%-%400 మీటర్ల లోతు వరకు భారీ గుంతలు ఏర్పడ్డాయని తెలంగాణ ఈఎన్‌సీ అనిల్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే మరమ్మతులు చేయాలని ఏపీని కోరామన్నారు. టెలీమెట్రీల ఏర్పాటుకు రూ.6 కోట్లను భరిస్తామని తెలియజేశామన్నారు. ఈ ఏడాది 780 టీఎంసీల కృష్ణా జలాల లభ్యత ఉండగా, ఇప్పటికే ఏపీ 500 టీఎంసీలు(76శాతం) వాడుకోగా, తెలంగాణ కేవలం 180 టీఎంసీలు మాత్రమే వాడిందన్నారు. ఏపీ అధిక వినియోగానికి తగ్గట్టు తెలంగాణకు వాటాలు పెంచాలని కోరామని చెప్పారు.

### బచావత్ కేటాయింపులకు రక్షణ కల్పించాలి : ఏపీ ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వర్లు

బచావత్ ట్రిబ్యునల్ (కృష్ణా ట్రిబ్యునల్%-%1) కేటాయింపుల ఆధారంగా ఏపీకి 66 శాతం, తెలంగాణకి 34 శాతం కృష్ణా జలాలను పంపిణీ చేయాలని కోరామని ఏపీ ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. కృష్ణా ట్రిబ్యునల్%-%2లో వాటాలు తేలే వరకు ఈ మేరకు కేటాయింపులను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ట్రిబ్యునల్ నిర్ణయం వచ్చేవరకు త్రిసభ్య కమిటీ పరస్పర అంగీకారంతో నీళ్లను పంచుకుంటామన్నారు. టెలీమెట్రీల ఏర్పాటుపై తమ ప్రభుత్వం చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. శ్రీశైలం జలాశయ ప్లంజ్‌పూల్‌కు మరమ్మతుల కోసం సీఎస్ఎంఆర్ఎస్ఈతో అధ్యయనం చేయిస్తున్నామని, కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) అధికారులతో చర్చించి మరమ్మతులపై నిర్ణయం తీసుకుంటామన్నారు. కృష్ణా బోర్డు కార్యాలయాన్ని ఏపీకి తరలించాలని డిమాండ్ చేశారు.

# ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దుల్లో భారీ ఎన్‌కౌంటర్

## 16 మంది మావోయిస్టులు మృతి

**మృతుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి.. కీలక నేతలు ఉన్నట్టు ప్రచారం**

**సోమవారం ఉదయమే మొదలైన ఎన్‌కౌంటర్.. దశల వారీగా ఎదురుకాల్పులు**

**తొలిరోజున ఇద్దరు..రెండో రోజు 14 మంది మృతదేహాలు లభ్యం**

**ఇంకా కొనసాగుతున్న బలగాల కూంబింగ్**

**25 నుంచి 30 మంది వరకు మావోయిస్టులు మృతిచెంది ఉండొచ్చనే అంచనాలు**

**కాంకేర్ ఎన్‌కౌంటర్ జరిగి వారం తిరగకముందే మరో ఎదురుదెబ్బ**



వరుస ఎన్‌కౌంటర్లతో కుదేలవుతున్న మావోయిస్టులకు ఊహించని షాక్ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 18 మంది మృతి చెంది వారం తిరగకముందే.. ఛత్తీస్‌గఢ్%-% ఒడిశా సరిహద్దుల్లో గరియాబంద్ జిల్లా కులారీఘాట్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 16 మంది మావోయిస్టులు మరణించారు. ఇందులో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, ఏఓబీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు చలపతి కూడా ఉన్నట్టు గుర్తించారు. అయితే మృతుల సంఖ్య 25 నుంచి 30 వరకు ఉండవచ్చని భావిస్తున్నారు. మంగళవారం రాత్రి తర్వాత కూడా ఎదురుకాల్పులు, కూంబింగ్ కొనసాగుతూ ఉండటంతో బుధవారం దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. దండకారణ్యంలోని కులారీఘాట్ అటవీ ప్రాంతంలో 60 మందికిపైగా మావోయిస్టులు సమావేశం అయ్యారన్న నిఘా వర్గాల సమాచారంతో బలగాలు రంగంలోకి దిగాయి. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సీఆర్‌పీఎఫ్, కోబ్రా, డిస్ట్రిక్ట్ ఫోర్స్, ఒడిశాకు చెందిన ఎస్ఓజీ (స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్) బలగాలు ఈ నెల 19 నుంచి సరిహద్దుల్లో కూంబింగ్ మొదలుపెట్టాయి. ఈ క్రమంలో 20వ తేదీన ఉదయం పోలీసు బలగాలు, మావోయిస్టులు ఎదురుపడటంతో ఎన్‌కౌంటర్ మొదలైంది. తొలిరోజు ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి చెందగా ఒక జవాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఇరు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో అదనపు బలగాలను రంగంలోకి దింపి.. సోమవారం మధ్యాహ్నం నుంచి కూంబింగ్ ఆపరేషన్ ముమ్మరం చేశారు. మంగళవారం తెల్లవారుజామున మళ్లీ మావోయిస్టులు తారసపడటంతో ఎదురుకాల్పులు మొదలయ్యాయి. కొన్ని గంటల పాటు హోరాహోరీగా సాగిన ఈ ఎన్‌కౌంటర్‌లో 14 మంది మృతి చెందారు. రెండు రోజుల్లో కలిపి మృతి చెందిన మావోయిస్టుల సంఖ్య 16కు పెరిగింది. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, ఆంధ్రా- ఒడిశా బోర్డర్ (ఏఓబీ) స్పెషల్ జోనల్ కమిటీ మిలిటరీ కమిషన్ చీఫ్ చలపతి అలియాస్ ప్రతాపరెడ్డి రామచంద్రారెడ్డి అలియాస్ జయరాం ఈ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందినట్టు పోలీసులు ప్రకటించారు. ఆయనతోపాటు మరికొందరు కీలక నేతలు కూడా మృతుల్లో ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. అయితే చలపతి మృతిపై స్పష్టత ఇచ్చిన పోలీసులు మిగతా వారి వివరాలను వెల్లడించలేదు. మృతుల సంఖ్య 25 %-% 30 మంది వరకు పెరగవచ్చని భావిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశాలకు చెందిన సుమారు 1,500 మంది పోలీసు బలగాలు కులారీఘాట్ అడవిని చుట్టుముట్టాయి. సుమారు 15%-%20 కిలోమీటర్ల సర్కిల్‌గా ఏర్పడి... కూంబింగ్ చేపడుతూ దగ్గరికి వచ్చాయి. సుమారు ఐదు కిలోమీటర్ల సర్కిల్‌లోకి రాగానే మావోయిస్టులు తారసపడినట్టు తెలిసింది. ఎన్‌కౌంటర్‌లో మరణించిన చలపతి సెంట్రల్ కమిటీ సభ్యుడు కావడంతో ఆయనకు మూడంచెల భద్రతా వ్యవస్థ ఉంటుంది. ముందు వరుసలో సెంట్రీలు కాపలాగా ఉంటే చివరి వరుసలో ఫీల్డ్ పెట్రోలింగ్ టీమ్ రక్షణగా ఉంటుంది. ఈ రెండింటి మధ్య బాంబులు అమర్చి ఉంటాయి. అయితే అగ్రనేతలు ఉన్నారనే పక్కా సమాచారంతోనే భద్రతా వలయాన్ని ఛేదించుకుని బలగాలు దాడి చేసినట్టు తెలిసింది. ఘటనాస్థలంలో ఇప్పటివరకు పది వరకు ఐఈడీలను గుర్తించి తొలగించినట్టు సమాచారం. కులారీఘాట్ ఎన్‌కౌంటర్ నేపథ్యంలో ఏవోబీ వ్యాప్తంగా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఘటన జరిగిన ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల సరిహద్దులకు సమీపంలో ఉన్న ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో పోలీస్ స్టేషన్లు, ఔట్‌పోస్టుల పరిధిలో రెడ్ అలర్ట్ అమలు చేస్తున్నారు. సరిహద్దుల్లో అదనపు బలగాలను రంగంలోకి దింపి కూంబింగ్ చేపడుతున్నారు. డ్రోన్ కెమెరాలతోనూ నిఘా పెట్టారు.



### బి.సి.సంక్షేమ సంఘం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యదర్శిగా దొంతిబోయిన శ్రీనివాస్ యాదవ్

నాచారం, జనవరి 21, వార్త మిర్రర్ : జాతీయ బి.సి.సంక్షేమ సంఘం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యదర్శిగా హెచ్. బి. కాలనీకు చెందిన దొంతిబోయిన శ్రీనివాస్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ బి.సి.సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య చేతులమీదుగా సోమవారం నియామక ఉత్తర్వులను అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ బి.సి.కులాల అభ్యున్నతికి పోరాడుతానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన బి.సి.ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచంద్ర యాదవ్, గౌరెల, మేకల పెంపకం దారుల రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము అశోక్ యాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మధు యాదవ్, సత్యనారాయణ యాదవ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



### రేషన్ కార్డు లేని వారంతా దరఖాస్తు చేసుకోవాలి :::16వ డివిజన్ కార్పొరేటర్ ఏనుగుల అనిల్ యాదవ్

బాలాపూర్, వార్త మిర్రర్ : మీర్పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 16 వ వార్డు డివిజన్ లో వార్డు డివిజన్ లో ఈరోజు పాష్ కాలనీ జెండా సెంటర్ దగ్గర 16వ వార్డు డివిజన్ గ్రామ సభ నిర్వహించారు. ఈ వార్డు సభలో రేషన్ కార్డు లేని వారి నుంచి, ఇండ్ల కొరకు దాదాపు 150 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఈ కార్యక్రమం 16 వార్డు డివిజన్ కార్పొరేటర్ ఎనుగుల అనిల్ కుమార్ యాదవ్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో అనిల్ యాదవ్ మాట్లాడుతూ రేషన్ కార్డు లేని ఇల్లు లేనివాళ్ళు తప్పనిసరిగా అప్లై చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కనమిషనర్ జ్ఞానేశ్వర్ , ఏఎంసి హరిరతన్, ఆర్డీవో చంద్రశేఖర్ రెడ్డి , వార్డు డివిజన్ అధికారి జాహ్నవి,అటెండ్ సుధాకర్, వివిధ కాలనీల ప్రజలు పాల్గొన్నారు.



### రియల్టర్ అనుచరుడిపై ఎంపీ ఈటల దాడి

**ప్లాట్లు కొన్నవారిని ఇబ్బంది పెడుతున్నారంటూ కొట్టిన వైనం**

**ఆపై దాడికి దిగిన ఎంపీ అనుచరులు.. ఇద్దరికి గాయాలు**

**పోలీసులకు బాధితుల ఫిర్యాదు.. ధర్మాన్ని కాపాడేందుకే: ఈటల**

సుధీర్ఘ రాజకీయ జీవితంలో సౌమ్యుడిగా పేరున్న బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్.. ఆవేశానికి లోనయ్యారు. పేద ప్రజలు కొనుక్కున్న స్థలాల్లో ఇల్లు కట్టుకునేందుకు వారికి అనుమతులు రాకుండా ఇబ్బంది పెడుతున్నారంటూ ఓ రియల్ వ్యాపారి అనుచరుడిపై చేయి చేసుకున్నారు. ఆ వెంటనే ఈటల అనుచరులు కూడా అతనిపై దాడికి పాల్పడ్డారు. దీంతో అతనికి తీవ్రగాయాలయ్యాయి. మంగళవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పోచారం మునిసిపల్ పరిధిలోని కొర్రెముల ఏకశిలానగర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్లాట్ల బాధితుల తరఫున ఎంపీ ఈటల రాజేందర్ మంగళవారం స్థల పరిశీలనకు వెళ్లారు. ఆ సమయంలో వెంచర్‌లోనే ఉన్న సదరు రియల్ వ్యాపారి అనుచరులను గమనించిన బాధితులు.. తమను ఇబ్బందులకు గురి చేస్తున్నది వారేనంటూ ఎంపీకి చూపించారు. దీంతో ఈటల ఆవేశంతో వేగంగా వెళ్లి రియల్ వ్యాపారి అనుచరుడు రఫీక్ చెంప చెళ్లుమనిపించారు. వెంటనే ఈటల చుట్టూ ఉన్న ఆయన అనుచరులు కూడా ఆగ్రహంతో రఫీక్‌తోపాటు మరో వ్యక్తి గ్యార ఉపేందర్‌పైనా దాడి చేశారు. ఈ దాడిలో రఫీక్, ఉపేందర్‌లకు గాయాలయ్యాయి. రఫీక్‌కు తీవ్ర గాయాలు కావడంతో అతడు గాంధీ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. కాగా, తమపై దాడికి పాల్పడ్డ ఎంపీ ఈటల రాజేందర్, ఆయన అనుచరులపై రియల్ ఎస్టేట్ వ్యాపారి అనుచరుడు గ్యార ఉపేందర్.. పోచారం ఐటీ కారిడార్ పోలీసస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈటలతోపాటు మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, కాలనీ వాసులు శివారెడ్డి, జుబేర్ అక్రమ్, మరో 20 మంది కలిసి తమపై విచక్షణా రహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఎంపీ ఈటల రాజేందర్‌పై ఫిర్యాదు అందిందని మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి ధ్రువీకరించారు.

### ధర్మాన్ని కాపాడేందుకే: ఈటల రాజేందర్

ఏకశిలానగర్ ఘటనపై ఎంపీ ఈటల రాజేందర్ స్పందిస్తూ.. తన 25 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎప్పుడూ ఎవరిపైనా చేయి చేసుకోలేదన్నారు. కానీ, ఈ వ్యవస్థను చూసి తట్టుకోలేక.. ప్రజల ఓట్లతో గెలిచిన బిడ్డగా పేదల పక్షాన నిలబడి ధర్మాన్ని కాపాడాటానికే ఈ విధంగా ప్రవర్తించాల్సి వచ్చిందని తెలిపారు. 'ఎంపీ వచ్చి ఏం పీకుతాడు?' అని వారు అన్నట్లు తనకు తెలిసిందని, వారికి ఇచ్చిన 'పనిష్మెంట్'ను తాను తప్పుగా భావించడం లేదని అన్నారు. అన్యాయానికి అండగా ఉన్న పోలీసులు, రెవెన్యూ అధికారులు సిగ్గుపడాలని వ్యాఖ్యానించారు. ఏకశిలానగర్‌లో దౌర్జన్యాలపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. సమస్యను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి, నవీన్ మిత్తల్‌కు, కలెక్టర్‌కు, సీపీకి లేఖ రాస్తానన్నారు. వారు స్పందించి ప్రజల ఆస్తులను కాపాడాలని డిమాండ్ చేశారు.

# అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందించాలి

**ప్రభుత్వ పథకాల అమలులో రాజకీయ నాయకుల జోక్యం ఉండకూడదు**

**సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి**




తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ ల పేరుతో ప్రభుత్వ పథకాలు గ్రామాలలో అమలు చేయాలని ఏర్పాటు చేస్తున్న ప్రజాపాలన గ్రామసభలలో అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని, ప్రభుత్వ పథకాల అమలలో కాంగ్రెస్ నాయకుల జోక్యం ఉండకూడదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు గడ్డం వెంకటేష్, రాగిరు కిష్టయ్య అన్నారు. మంగళవారం రోజున చౌటుప్పల్ మండలం మందోల్లగూడెం గ్రామంలో స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో మందోల్లగూడెం, సింగరాయ చెరువు, తూర్పుగూడెం గ్రామాలలో నెలకొన్న స్థానిక సమస్యలను పరిష్కరించాలని రిలే నిరాహార దీక్ష చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ ల పేరుతో ప్రభుత్వ పథకాలను పేదలకు అందించాలని ప్రజా పాలన గ్రామసభలను ఏర్పాటు చేయడం జరిగింది. ప్రజాపాలనలో అర్హులైన వారికి ఇండ్లు ఇండ్ల స్థలాలు, రేషన్ కార్డులు, రైతుబంధు, రైతు భరోసా మొదలగు అంశాలు అమలు అయ్యే విధంగా బాధ్యత తీసుకోవాలని వారు అన్నారు. అదేవిధంగా గ్రామాలలో కాంగ్రెస్ నాయకుల జోక్యం పెరిగి అర్హులకు కాకుండా ఇస్తానుసారంగా ప్రభుత్వ పథకాల అమలును ప్రోత్సహిస్తున్నారని దీనిపై కాంగ్రెస్ నాయకుల జోక్యం ఉండకుండా అర్హులకు ప్రభుత్వ పథకాలు అందెల అధికారులు చొరవ చేయాలని వారు అన్నారు. స్థానికంగా కుక్కలు కోతుల బెడద నుండి ప్రజలను కాపాడాలని, గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, బొమ్మలకుంట నుండి సింగరాయ చెరువులకు కాల్వ వెడల్పు చేయాలని, మందోల్లగూడెం పాఠశాల నుండి పర్యబాయి వరకు బ్యాటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని, బీసీ కమ్యూనిటీ హాల్ కు నిధులు కేటాయించి భవనాన్ని పూర్తి చేయాలని, నీల అంజయ్య ఇంటి నుండి పెద్ద కొండూరు వరకు వీటి రోడ్డు నిర్మాణం చేయాలని, ఎన్జీఆర్ఐ కుంట నుండి బీరప్ప కుంట వరకు పిల్లకాలువ నిర్మాణం చేయాలని, మందుల గూడెం ప్రైమరీ పాఠశాలలో వంటగది నిర్మించాలని, స్థానిక పరిశ్రమలలో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. వీరితోపాటు సింగిల్ విండో డైరెక్టర్ బోరం నర్సిరెడ్డి, శాఖ కార్యదర్శి కొండ శ్రీశైలం, మాజీ ఎంపీటీసీ చెన్నబోయిన వెంకటేశం, మండల కార్యదర్శివర్గ సభ్యులు చీర్క సంజీవరెడ్డి, చింతల సుదర్శన్, తడక మోహన్, పొట్ట శ్రీను, మండల కమిటీ సభ్యులు ఆదిమూలం నందీశ్వర్, నాయకులు ఇట్టబోయిన శేఖర్, చిర్కఅలివేలు సప్పిడి రాఘవరెడ్డి మంద బుచ్చిరెడ్డి కస్తూరి లింగస్వామి కొండే నరసింహ యాట బాలరాజు సప్పిడి శ్రీనివాస్ రెడ్డి శ్యాంసుందర్ రెడ్డి, పాపగల శంకరయ్య, యాట ముత్యాలు, వల్లూరి వెంకటేశం, కూరెల్ల నర్సిరెడ్డి, సప్పిడి నరేందర్ రెడ్డి, నీల అంజయ్య, పాపగళ్ళ లింగస్వామి, కొండే స్వరాజ్యం, శివ, లెనిన్, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించి ప్రమాదాలు నివారించాలి: ఎంవిఐ వీరస్వామి

మిర్యాలగూడ , జనవరి 21:-(వార్తమిర్రర్): ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలు నివారించాలని స్థానిక మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎల్.వీరాస్వామి కోరారు. మంగళవారం మిర్యాలగూడ పట్టణం చైతన్య నగర్ లోని శిష్యపాఠశాలలో మంగళవారం రోడ్డు భద్రతా మాసోత్సవం సందర్భంగా అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. రోడ్డు నియమ నిబంధనలు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించాలన్నారు. ట్రాఫిక్ ఉన్న సమయంలో ఓవర్ టేక్ చేయరాదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ట్రాఫిక్ ఎస్ఐ సిహెచ్.శ్రీనివాస్ మాట్లాడుతూ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని, రెడ్ గ్రీన్ ఎల్లో లైట్లను,సిగ్నల్స్ పాటించాలన్నారు. వార్డు కౌన్సిలర్ శాగ జయలక్ష్మి జలంధర్ రెడ్డి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండని యువత, విద్యార్థులు వాహనాలు నడపరాదన్నారు. ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. శిష్య పాఠశాల చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ వాహనాలను నడిపేటప్పుడు సెల్ఫోన్ వాడవద్దని, ట్రాఫిక్ సిగ్నల్స్ చూస్తూ వాహనాలను నడపాలని, పొగమంచు, ధూళి, చీకటి ప్రదేశాలలో వెళ్ళేటప్పుడు నెమ్మదిగా వెళ్ళాలని, విద్యార్థులకు తెలిపారు. నేటి విద్యార్థులు, రేపటి భావి భారత పౌరులు




అని విద్యార్థులకు చక్కగా వివరించారు. సదస్సులో ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మిర్యాలగూడ మండలంలో 4 సంక్షేమ పథకాలకు గ్రామసభల్లో మళ్లీ 1371 దరఖాస్తులు






మిర్యాలగూడ జనవరి 21:-(వార్తమిర్రర్) : రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల గ్రామ సభలను మిర్యాలగూడ మండలం ఆలగడప, తడక మల్ల మరో పది గ్రామపంచాయతీలల్లో సోమవారం నిర్వహించారు. ప్రత్యేక అధికారి బి.దేవ్ సింగ్ ఎంపిడిఓ ఎం.శేషగిరిశర్మ, డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ రాజేశ్వరి రెవెన్యూ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, వ్యవసాయ శాఖ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు. 4 పథకాల క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన జాబితాను గ్రామసభలో ప్రదర్శించి చదివి వినిపించారు. నాలుగు పథకాల దరఖాస్తులు గ్రామసభలో తీసుకున్నారు. ఇది నిరంతర ప్రక్రియ అని ఎవరు ఆందోళన చెందవద్దని అధికారులు తెలిపారు. మిర్యాలగూడ మండల పరిధిలోని 12 గ్రామపంచాయతీల్లో గ్రామసభలో లబ్దిదారుల పేర్లు ప్రకటించి ఆమోదం పొందగా అయితే అనేకమంది దరఖాస్తు చేసుకున్న వారికి లబ్ధి చేకూరకపోవడంతో అధికారుల ముందు మొరపెట్టుకొనగా మళ్లీ దరఖాస్తు చేసుకోమన్నారు. దీంతో రైతు భరోసాకు 11 దరఖాస్తులు, రేషన్ కార్డులకు 591, ఇందిరమ్మ ఇళ్లకు 355, రైతు ఆత్మీయ భరోసాకు 414 మొత్తం 1371 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు.

# మీనపల్లి గ్రామంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవాబుపేట్: జనవరి 21: (వార్త మిర్రర్): ఎన్నో సంవత్సరాల తర్వాత జీవితంలో స్థిరపడి ఒకే వేదికపై అందరూ చిన్ననాటి తరగతిగది చిలిపి చేష్టలను నెమరేసుకున్నారు. వికారాబాద్ జిల్లా నవాబుపేట్ మండలం మీనపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివి, తదనంతరం వారి వారి వృత్తి ఉద్యోగాలలో స్థిరపడిపోయారు. వారంతా ప్రస్తుతం ఒకే వేదికపై కలుసుకొని తమ చిన్ననాటి అనుభవాలను వేదికపై పంచుకున్నారు. పాఠశాలలోని తరగతి గదిలో జరిగిన సంఘటనలను పూర్వ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థుల సమక్షంలో వారి వారి అభిప్రాయాలను పంచుకున్నారు. ఆనందంగా గడిపారు. ఎన్నో సంవత్సరాల తరువాత ఇలా అందరూ ఒకే వేదికపై కలుసుకోవడం సంతోషంగా ఉందని వారన్నారు. అప్పట్లో ఉపాధ్యాయులుగా పనిచేసిన కొందరు మాట్లాడుతూ19 సంవత్సరాల తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగు పంతులు బ్రహ్మానందం రెడ్డి, మల్లేశం, సుకన్య, మహేశ్వరి, భాగ్యమ్మ, రేణుక, ఉష్రశ్రీ, రాణి, స్వర్ణలత, సక్కుబాయి, ప్రవళిక, సంగమేశ్వర్ రెడ్డి, శశిధర్ రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, లక్ష్మణ్, హైమద్, అర్జున్, గణేష్ పాల్గొన్నారు.



# నిరుద్యోగులకు అండగా ఉండేందుకే ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న

**ఉద్యోగ రూపకల్పనలో ముందువరుసలో ఉంటా**

**ప్రైవేటు ఉపాధ్యాయులకు హెల్త్ కార్డుల మంజూరికి కృషి**

**రాయికల్ పట్టభద్రులతో ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి**



వార్త మిర్రర్ జగిత్యాల నియోజకవర్గం ప్రతినిధి జనవరి 21 : నిరుద్యోగులకు అండగా నిలిచి వారి సమస్యలు పరిష్కరించేందుకే తాను పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నట్టు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి వెల్లడించారు. మంగళవారం జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలో పలువురు పట్టభద్రులను కలిసి రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు పలకాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉద్యోగ, నిరుద్యోగ, పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఒక మంచి ఉద్దేశంతో తాను రాజకీయాల్లోకి వస్తున్నట్టు వెల్లడించారు. నిరుద్యోగులకు అండగా ఉంటూ, ఉద్యోగ రూపకల్పనలో ఉంటానని వెల్లడించారు. ప్రైవేట్ విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రైవేట్ విద్యా సంస్థలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు చేదోడు – వాదోడుగా ఉంటూ వారికి ఉద్యోగ భద్రతతో పాటు హెల్త్ కార్డుల మంజూరుకి కృషి చేస్తానని పేర్కొన్నారు. తాను ఎమ్మెల్సీగా గెలిచిన తర్వాత వచ్చే వేతనాన్ని ఒక సంక్షేమ నిధి ఏర్పాటు చేసి నిరుపేద ఉపాధ్యాయులకు, నిరుద్యోగ పట్టబద్రుల సంక్షేమానికి వెచ్చిస్తానని వెల్లడించారు. విద్యారంగంలో అనేక మార్పులు తెచ్చిన తాను రాజకీయ రంగంలో కూడా నూతన ఒరవడి సృష్టిస్తానని వెల్లడించారు. రానున్న పట్టభద్రులు ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్స్ బాలె శేఖర్, కైరం సత్యం, ఎద్దండి ముత్యంపు రాజు రెడ్డి, మచ్చ గంగాధర్, నిఖిల్ కుమార్, లలిత, నివేదిత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఫిబ్రవరి 7న లక్ష డబ్బులు వేయి గొంతుల కార్యక్రమం విజయవంతం చేయాలి

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జనవరి 21 : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు ఫిబ్రవరి 7వ తేదీన లక్ష డబ్బులు- వేయి గొంతుల కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతూ, చౌటుప్పల మండల కేంద్రంలో ఈనెల 26వ తేదీన ఎమ్మార్పీఎస్ చౌటుప్పల మండల కమిటీ ఆధ్వర్యంలో 100 డబ్బులతో ప్రదర్శన నిర్వహించడం జరుగుతుంది.డప్పుల ప్రదర్శన అనంతరం వర్గీకరణ కోసం మద్దతు తెలిపే కళాబృందం ప్రదర్శన లో పాల్గొంటారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో చౌటుప్పల్, హైదరాబాద్ లో జరిగే డప్పుల కమిటీ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు మీసాల గణేష్ మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి మాదిగ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. చౌటుప్పల మండల అధ్యక్షుడుగా ఉబ్బు ఉపేందర్, ప్రధాన కార్యదర్శి నక్క మహేష్, సాంస్కృతిక కార్యదర్శి బర్రె సుధాకర్, మున్సిపల్ అధ్యక్షుడుగా బద్రి గాలయ్య మాదిగ లను నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాదిగ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర నాయకులు ఊదరి వెంకటేష్ మహాజన్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బొడ్డు శ్రవణ్ కుమార్,మండల ఉపాధ్యక్షుడు చీమకండ్ల శ్రీనివాస్,మున్సిపల్ అధ్యక్షుడు ఎర్ర శంకర్, సాంస్కృతిక సహాయ కార్యదర్శి పిట్ట శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బర్రె శంకర్, చౌటుప్పల మండలం కళాకారులు ఉబ్బ లచ్చయ్య, యాదగిరి, విష్ణు, మహేష్, పరశురామ్, లింగస్వామి, ఐతపాక నాగరాజు, నక్క ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు..



## పీపల్ పహాడ్ గ్రామం నుండి ఏనగండి తండాకు మట్టి రోడ్డు

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జనవరి 21 : చౌటుప్పల్ మండలం పీపల్ పహాడ్ గ్రామం నుండి ఏనగండి తండా వరకు ఉన్న కంకర రోడ్డు వలన రెండు గ్రామాల ప్రజలకు, రైతులకు తండా వాసులకు గత 10 సంవత్సరాల నుండి వాహనాల రాక పోకలకు ఇబ్బందిగా మారింది. బాధపడుతున్న విషయాన్ని గమనించి, ప్రజలకు ఇబ్బంది కలగకుండా మునుకుంట్ల వెంకటేశం గౌడ్ తన సొంత డబ్బులతో గ్రామ ప్రజల శ్రేయస్కరం కోసం ఖర్చు పెట్టి రోడ్డును బాగు చేసి మట్టిని పోయించడం జరిగింది. దేవలమ్మ నాగారం నుండి పీపల్ పహాడ్ గ్రామం వరకు గుంతలుగా ఉన్న రోడ్డును మంచిగా చేయించడం జరిగింది. బిజెపి సీనియర్ నాయకులు పూలనాగారి రమేష్, బిజెపి మాజీ అధ్యక్షుడు ఉడుగు యాదయ్య, తోర్పునూరి రంజిత్ కుమార్, మాధగోని గాల్లయ్య. సిదుగుళ్ల యాదయ్య, నూనె సహదేవ్, ఎర్ర ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాపాలన వార్డుల వారీగా గ్రామసభలు విజయవంతం చేయాలి

**మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు**

**రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,రేషన్ కార్డులు**

**ఇందిరమ్మ ఇండ్లు నిజమైన లబ్ధిదారుల ఎంపిక**

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జనవరి 21 : చౌటుప్పల పట్టణ కేంద్రంలో వివిధ వార్డులో ఏర్పాటు చేసినటువంటి ప్రజాపాలన వార్డు సభలను ఉద్దేశించి మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు మాట్లాడుతూ మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి సారథ్యంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ చెందుతాయని అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరో నాలుగు సంక్షేమ పథకాల అమలుకు శ్రీకారం చుట్టింది. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లు నిజమైన లబ్ధిదారుల ఎంపిక పారదర్శకత ప్రాధాన్యతనిస్తూ 21-01-2025, నుండి 24-01-2025, వార్డు సభల ద్వారా లబ్ధిదారులను గుర్తించడం జరుగుతుంది. అధికారులు కాంగ్రెస్ పార్టీ లీడర్లందరూ సమన్వయం చేసుకుంటూ వార్డు సభలను విజయవంతం చేయగలరు. ముఖ్యంగా మున్సిపల్ అధికారులు అందరు కూడా వార్డు సభలను దగ్గర ఉండి నడిపించాలి.ప్రజల ఎవ్వరు కూడా అపోహలను, బిఆర్ఎస్ పార్టీ చేసే అసత్యాలను నమ్మవద్దు, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిరంతరంగా సంబంధిత అధికారుల ద్వారా వార్డు సభల ద్వారా అప్లికేషన్ చేసుకోవచ్చు ఎవ్వరు అధైర్య పడొద్దు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అనే విషయాన్ని అందరికీ తెలియాలి మన రాష్ట్రంలోని ప్రతి ఒక్కరు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను సంక్షేమ పథకాలను మర్చి పోవద్దు తెలియజేస్తున్నాను.. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కోమటిరెడ్డి నరసింహ రెడ్డి, కౌన్సిలర్ ఎండీ బాబా షరీఫ్, విజయలక్ష్మి బాలరాజు, షాది ఖానా చైర్మన్ కరీం,చోటే బాయ్,ఊడుగు వెంకటేశం తదితరులు పాల్గొన్నారు..

## సోమనబోయిన అశోక్ యాదవ్ మృతి చెందడం బాధాకరం

**మృతుని కుటుంబాన్ని పరామర్శించి**

**5000/వేల ఆర్థిక సాయం అందజేసిన-ఉప్పల లింగస్వామి**



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండల కేంద్రానికి చెందిన సోమన బోయిన పర్వతాలు కుమారుడు సోమనబోయిన అశోక్ గతవారం రోడ్డు ప్రమాదంలో హాస్పిటల్లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. వారి మృతదేహానికి పూలమాలవేసి, నివాళు లర్పించి వారి కుటుంబానికి తక్షణ సహాయం కింద 5000/వేల రూపాయలు ఆర్థిక సహాయంగా అందజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి ఈ కార్యక్రమంలో గుత్త ప్రేమ్చందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కోన్ రెడ్డి నరసింహ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రత్తి పెల్లి యాదయ్య, గుత్తా రవీందర్ రెడ్డి, అందే నరేష్ యాదవ్, రసమల్ల నగేష్, వివిధ పార్టీ నాయకులు ఎడ్ల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

## రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



శంషాబాద్ వార్త మిర్రర్ : ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి. నారాయణ రెడ్డి స్పష్టం చేశారు..మంగళవారం శంషాబాద్ మండలం కాచారం గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన గ్రామ సభలో కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... సంక్షేమ పథకాలు అమలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఈ నెల 26 నుండి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా,ఇందిరమ్మ ఇళ్లు,ఆహార భద్రత (రేషన్) కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల గురించి గ్రామస్తులకు వివరించారు.ఈ పథకాల కింద అర్హులను గుర్తించేందుకు వీలుగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించడం జరిగిందని కలెక్టర్ గుర్తు చేశారు. ముఖ్యంగా సాగుకు యోగ్యమైన భూములను పక్కాగా నిర్ధారించామని అన్నారు.పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతుకు ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద ఎకరానికి 12 వేల రూపాయల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తుందని తెలిపారు.అదే విధంగా సాగు భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రెండు విడతల్లో సంవత్సరానికి 12 వేల రూపాయలు అందించడం జరుగుతుందన్నారు.ఎలాంటి సాగు భూమి లేకుండా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజులు పని చేసిన కుటుంబాలను అర్హులుగా గుర్తించామన్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్ర పరిశీలన జరిపి, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులను నిర్ధారించామని తెలిపారు.ఈ మేరకు వివిధ పథకాల ద్వారా అర్హులుగా గుర్తించబడిన వారి వివరాలను గ్రామ సభలో అందరి సమక్షంలో చదివి వినిపించారు.ఇంకా ఏమైన ఎలాంటి అభ్యంతరాలు ఉంటే వాటిని కూడా పరిగణలోకి తీసుకుంటారని కలెక్టర్ తెలిపారు.ఆయా పథకాల కింద ఇప్పటివరకు దరఖాస్తులు చేసుకోని వారితోపాటు,అర్హత కలిగి లబ్ధిదారుల జాబితాలో పేర్లు లేని వారి నుండి కూడా అర్జీలు స్వీకరించారు.రేషన్ కార్డుల జారీ,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర పథకాల కోసం అర్హత కలిగిన వారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు.వాటిని సమగ్రంగా పరిశీలించి,అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడం జరుగుతుందని తెలిపారు. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలు, అనవసర ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని అన్నారు.గ్రామ సభలలో దరఖాస్తులు అందజేయవచ్చని, వీలుపడని వారు ఈ నెల 26 తరువాత ఎప్పుడైనా మండల కార్యాలయాలలోని ప్రజా పాలన సేవా కేంద్రాలకు వెళ్లి సంబంధిత పత్రాలను జత చేస్తూ దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ వెంకట్ రెడ్డి, తాహసిల్దార్ రవీందర్ దత్తు, ఎంపీడీవో మున్ని, ఎంపీఓ ఉషారాణి, గ్రామ మాజీ సర్పంచ్ గోపాల్, దర్గా సత్తయ్య,మధుసూదన్ నాయక్, అధికారులు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఓయూ వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం ను ఘనంగా సన్మానించిన 1977 నుంచి 1988 విద్యార్థి సంఘ ఎన్నికల్లో గెలిచిన పూర్వ విద్యార్థులు సన్మానం






సికింద్రాబాద్, వార్త మిర్రర్ జనవరి 21.... ఉస్మానియా విశ్వవిద్యాలయ పూర్వ అధికారిక విద్యార్థి సంఘ అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం ను ఘనంగా సత్కరించారు. 1977 నుంచి 1988 వరకు విద్యార్థి సంఘ ఎన్నికల్లో గెలిచి ఓయూ విద్యార్థి సంఘానికి ప్రాతినిధ్యం వహించిన పలువురు పరిపాలనా భవన్ లో ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం, రిజిస్ట్రార్ ఆచార్య జి. నరేష్ రెడ్డి, ఓఎస్డీ ఆచార్య జితెందర్ నాయక్ తో భేటీ అయ్యారు. పూర్వ విద్యార్థులుగా, విద్యార్థి సంఘ ప్రతినిధులుగా ఓయూ అభ్యున్నతికి అవసరమైన సహకారాన్ని అందిస్తామని ఈ సందర్భంగా ప్రతిపాదించారు. ఓయూకు పునర్వైభవం తీసుకురావటంతో పాటు ఓయూకున్న ఖ్యాతి, ప్రపంచస్థాయి గుర్తింపును కాపాడుకోవాలని ఆకాంక్షించారు. అకడమిక్ ఎక్సలెన్స్, ఫ్యాకల్టీ డెవలప్ మెంట్, మెరుగైన మౌళిక వసతుల కల్పన, విద్యార్థులకు సహకారం, పూర్వ విద్యార్థుల భాగస్వామ్యం, ఓయూతో పరిశ్రమల భాగస్వామ్యం, సుపరిపాలన, ప్రమోషన్ అండ్ బ్రాండింగ్, నైతిక విలువలు, ఆర్థిక సహకారం తదితర అంశాల్లో మెరుగుదల కోసం తగిన చర్యలు చేపట్టాలని పూర్వ విద్యార్థి సంఘ నాయకులు కోరారు. ఓయూలో విద్యార్థి సంఘ ఎన్నికలు నిర్వహించేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా తనను సత్కరించిన ఓయూ పూర్వ విద్యార్థి నాయకులకు ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం కృతజ్ఞతలు తెలిపారు. ఓయూ సమగ్రాభివృద్ధిలో పూర్వ విద్యార్థులు భాగస్వామ్యం కావాలని కోరారు. అధ్యాపక నియామకాలు సహా అవసరమైన సహకారాన్ని అందించేందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తోందని వివరించారు. పూర్వ విద్యార్థులు సైతం ముందుకు వచ్చి ఆయా విభాగాలు, మౌళిక వసతుల కల్పనలో సహకారం అందించాలన్నారు. విద్యా, పరిశోధన, రాజకీయాల్లో ఓయూ క్రియాశీలకంగా ఉండేదని ఆనాటి జ్ఞాపకాలను ఈ సందర్భంగా ఓయూ అధికారులతో పూర్వ విద్యార్థి నాయకులు పంచుకున్నారు. విద్యాభ్యాసం కోసం ఓయూకు వచ్చిన తాము ఆయా రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నామని ఒకరికొకరు పరిచయం చేసుకున్నారు. తిరిగి ఓయూకు చెల్లించేందుకు తమ శాయాశక్తుల కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మొత్తం కార్యక్రమాన్ని మెదక్ మాజీ ఎమ్మెల్యే ఓయూ ఆర్ట్స్ కళాశాల మాజీ అధ్యక్షుడు పట్లోళ్ల శశిధర్ రెడ్డి సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో నాటి విద్యార్థి సంఘ ఎన్నికల్లో గెలుపొంది ఓయూలోని ఆయా కళాశాలలకు విద్యార్థి సంఘానికి ప్రాతినిధ్యం వహించిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. నాటి ఆర్ట్స్ కళాశాల మాజీ ఉపాధ్యక్షుడు, నాసిక్ విశ్వవిద్యాలయ మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ వాయునందన్, రాజేందర్, శ్రీధర్, ఖలీల్, ప్రదీప్ రెడ్డి, కె. కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. దాదాపు 50 మంది పూర్వ విద్యార్థి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అవినీతికి పాల్పడిన కొండకల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎల్లయ్య పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్

## గ్రామసభలో అధికారులకు వింత అనుభవం





శంకర్‌పల్లి , జనవరి :21:(వార్త మిర్రర్) : శంకర్‌పల్లి మండల పరిధిలోని కొండకల్ గ్రామ సభలో మంగళవారం అధికారులకు వింత అనుభవం ఎదురైంది. ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు పథకాల లబ్ధిదారులను గుర్తించేందుకు ప్రత్యేక అధికారుల సమక్షంలో నిర్వహించిన గ్రామ సభలో భూ ఆక్రమణ పై ప్రజలు అధికారులను నీలదీశారు. కొండకల్ గ్రామంలో గత వందేళ్లుగా 360, 361, 362 నుంచి 400 సర్వే నంబర్ మధ్యలో ఉన్న భూములను సాగు చేసుకుంటున్నామని వాటిని ఆక్రమించుకుంటే అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు, గ్రామ కార్యదర్శి ఎల్లయ్య కోట్ల రూపాయల అవినీతికి పాల్పడి తమకు సాగు భూములు లేకుండా చేశారని గ్రామస్తులు ఆరోపించారు. సీలింగ్, అసైండ్ భూములు, చెరువులను సైతం ఆక్రమించుకుని తమ జీవనధారాన్ని నాశనం చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భూముల చుట్టూ ప్రహరీ గోడ నిర్మించిన సందర్భంలో ఉన్నతాధికారులకు, గ్రామ కార్యదర్శికి ఫిర్యాదు చేశామని వారు తెలిపారు. తమకు ఇబ్బంది కలిగేలా భూములను ఆక్రమించుకొని ప్రహరీ గోడ నిర్మించినా.. స్పందించని అధికారులు, గ్రామ కార్యదర్శి పై తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామ సభలో గ్రామస్తులు పట్టుబట్టారు. గ్రామ కార్యదర్శి ఎల్లయ్య పై, రెవిన్యూ అధికారుల పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు సమిష్టిగా గ్రామ సభ జరగకుండా అడ్డుకున్నారు. కొద్దిసేపు గ్రామ సభలో గందరగోళం ఏర్పడింది. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలి: ఎమ్మెల్సీ అభ్యర్థి పన్నాల గోపాల్‌రెడ్డి



మిర్యాలగూడ, జనవరి 21:-(వార్తమిర్రర్) : ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన హామీ ప్రకారము సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానమునే కొనసాగించాలని వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పన్నాల గోపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. ఈరోజు మిర్యాలగూడ కేంద్రంలో వివిధ ఉపాధ్యాయ ,అధ్యాపకులను కలిసి ఓట్లను అభ్యర్థించినారు.ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం మంత్రుల కమిటీని వేసిన ఫ్పటికీ పరిష్కారం ఖాళీదన్నారు టీచర్లు తమ అవసరాల కోసం పెట్టుకున్న జిపిఎఫ్, జిఐఎస్ లోన్లు , సరెండర్ లీవులు బిల్లులు గత ఏడాది నుంచి పెండింగ్లో ఉన్నవి, పదవి విరమణ చేసిన ఉపాధ్యాయులకు రావలసిన బెనిఫిట్స్ వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఉద్యోగ విరమణ వయసు పెంచే ఆలోచనను విరివించు కోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్లో ఇచ్చినట్లుగానే తెలంగాణలో కూడా స్పెషల్ టీచర్లకు నేషనల్ ఇంక్రిమెంట్ ఇచ్చి పెన్షన్ కు బెనిఫిట్ కల్పించాలని కోరారు. శాసనమండలికి గెలిపిస్తే అన్ని యాజమాన్యాలు ఎయిడెడ్ మోడల్ స్కూల్స్ గురుకుల కేజీబీవీ పాఠశాలల ఉపాధ్యాయులకు జీరో ఒన్, జీరో పద్దు ద్వారా వేతనాలు చెల్లింపులు జరుపుటకు , యూనివర్సిటీ, మెడికల్, అగ్రికల్చర్, వెటర్నరీ, ఇంజనీరింగ్, నవోదయ కేంద్ర పాఠశాలలో అధ్యాపకుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. టీజేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ పన్నాల గోపాల్ రెడ్డికి టిజెఎస్ పార్టీ నల్గొండ జిల్లా పూర్తి మద్దతు తెలిపారు. విద్యార్థి దశ నుండి ఉపాధ్యాయ ఉద్యమంలో ఉన్నారని, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదవీ విరమణ పొందిన విద్యారంగా సమస్యల పట్ల స్పందిస్తూ పనిచేస్తున్నారు. ప్రశ్నించే గొంతుకు, ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు గోపాల్ రెడ్డిని అధ్యాపక, ఉపాధ్యాయులు అందరూ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో టీజేఎస్ జిల్లా ఉపాధ్యక్షులు లావూరి క్రాంతి కుమార్. సత్య ప్రకాష్ నాయుడు, పి జానయ్య పాల్గొన్నారు.

## ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలో మిర్జాగూడ హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

### నిందితుడికి జీవిత ఖైదు విధించిన రంగారెడ్డి జిల్లా పిడిజే కోర్ట్ న్యాయమూర్తి శశిధర్ రెడ్డి



శంకర్పల్లి, జనవరి :21:(వార్త మిర్రర్) : శంకర్పల్లి మండలం మిర్జాగూడ అనుబంధ గ్రామమైన ఇందిరారెడ్డి నగర్ కాలనీ ఫేజ్-2 లో జరిగిన హత్య కేసులో నిందితుడు జల్పెట్ మాణిక్యానికి జీవిత ఖైదు మరియు రూ. 500 జరిమానా విధించారు. ఈ తీర్పు రంగారెడ్డి జిల్లా PDJ కోర్టు న్యాయమూర్తి ఎస్. శశిధర్ రెడ్డి ఇచ్చారు.2024 మే 5-6 నాడి అర్ధరాత్రి 12:30 గంటలకు జల్పెట్ మాణిక్యం (48) తన భార్య జల్పెట్ యాదమ్మ (45) పై అక్రమ సంబంధం పెట్టుకున్నట్లు అనుమానించి ఆమెను నిద్రిస్తున్న సమయంలో రాయితో తలపై కొట్టి హత్య చేశాడు.ఈ ఘటన తర్వాత మోకిలా పోలీస్ స్టేషన్‌లో హత్య కేసు నమోదు కాగా, ఇన్స్పెక్టర్ బి. వీరబాబు నిందితుని 06.05.2024 నాడు అరెస్టు చేశారు.ఈ కేసులో ప్రభుత్వ అభియోజకులు శోభారాణి, వి. వెంకటేశ్వర్లు, మరియు CDO కె. సర్దార్ నాయిక్ కీలక పాత్ర పోషించారు.



## రాయికల్ మండలంలో షెడ్యూలు ప్రకారం గ్రామసభలు నిర్వహణ

వార్త మిర్రర్ జగిత్యాల నియోజకవర్గం ప్రతినిధి జనవరి 21 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలలో గుర్తించిన లబ్ధిదారులను షెడ్యూలు ప్రకారం గ్రామాలలో గ్రామ ప్రత్యేక అధికారి అధ్యక్షతన గ్రామసభలను నిర్వహించి ఆమోదం తీసుకోవడం జరిగింది. మంగళవారం రోజున రాయికల్ మండలం లో చేర్ల కొండాపూర్, ఉప్పుమడుగు, వస్తాపూర్, ఒడ్డెర కాలనీ, మంత్యనాయక్ తండా, తట్లవాయి, కైరిగుడెం శ్రీరామ్ నగర్ గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించడం జరిగింది. ఇట్టి గ్రామ సభలకు మండల ప్రత్యేక అధికారి డీసీవో మనోజ్ కుమార్, తహసీల్దార్ అబ్దుల్ కయ్యుం, ఎంపీవో సుష్మా మరియు మండల అధికారులు , పంచాయితీ కార్యదర్శులు హాజరు అయ్యారు.



## పంటలకు సరిపడా నీటి విడుదల చేయించండి

### ::: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి రాయికల్ మండల రైతుల వినతి

వార్త మిర్రర్ జగిత్యాల నియోజకవర్గం ప్రతినిధి జనవరి 21 : జగిత్యాల జిల్లా రాయికల్ మండలం దావనపల్లి, కట్కాపూర్ గ్రామాల రైతులం దాదాపు 3,000 ఎకరాలలో వరి పంట సాగుతూ రైతులం జీవనాధారం పొందుతున్నాము. మా పంటలకు సరిపడా నీటి విడుదల చేయుటకు చొరవ తీసుకొని మా పంటలను రక్షించి రైతులను ఆదుకోవాలని కట్కాపూర్ ధావన్ పల్లి రైతులు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ని కోరారు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అధికారులతో ఫోన్ లో మాట్లాడి సమస్య పరిష్కరించాలని సూచించారు.



## రాయికల్ మున్సిపాలిటీ పరిధి లో వార్డ్ సభల నిర్వహణ

వార్త మిర్రర్ జగిత్యాల నియోజకవర్గం ప్రతినిధి జనవరి 21 : తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలన వార్డు సభలలో భాగంగా ఈ రోజు రాయికల్ పట్టణములోని 3 వార్డులు (వార్డు 1,2,3) లలో వార్డు సభలు నిర్వహించనైనది. ఇట్టి వార్డు సభలకు ప్రజలు అధికశాతంలో పాల్గొన్నారు మరియు ఈ రోజు జరిగిన వార్డు సభలలో రేషన్ కార్డులకు 90 మరియు ఇందిరమ్మ ఇండ్లకు 57 దరఖాస్తులు వచ్చినవి. ఇట్టి వార్డు సభలకు ముఖ్య అతిదులుగా శ్రీయుత గౌరవ చైర్ పర్సన్ మోర హన్మండ్లు, స్పెషల్ ఆఫీసర్ డిఈవొ రాము, వైస్ చైర్ పర్సన్ శ్రీమతి గండ్ర రమాదేవి, శ్రీయుత కమిషనర్ శ్రీ ఎ. జగదీశ్వర్ గౌడ్, వార్డు కౌన్సిలర్స్ శ్రీ మారంపెల్లి సాయికుమార్ మరియు శ్రీ కన్నాక మహేందర్, క్లస్టర్ ఆఫీసర్ శ్రీ బి. వెంకటి, రెవెన్యూ ఆర్.ఐ, వార్డు అధికారులు, ఆర్.పి లు, ప్రజలు, నాయకులు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తమ భూమికి సంబంధించి విషయం తెలుసుకోకుండా ఎంపీ ఈటల మాపై దాడి చేయడం దారుణం: బాధితులు



సికింద్రాబాద్, వార్త మిర్రర్ జనవరి 21 ...మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ ఎంట్రీ తో కొర్రెముల లోని ఏకశిలా నగర్ భూముల వివాదం వివాదా స్పదంగా మారింది. ఏకశిలా నగర్ వెంచర్ నిర్వాహకులు తార్నాక లో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎంపీ ఈటెల రాజేందర్ పై మండిపడ్డారు. ఏకశిలా నగర్ భూములకు యజమానులం మేము అని అన్నారు. ఈ వెంచర్ కి సంబంధించిన డాక్యుమెంట్లన్నీ మావద్ద ఉన్నాయని అన్నీ న్యాయస్థానాల్లో తీర్పు మాకు అనుకూలంగా వచ్చిందని వివరించారు. భూ యజమానులమైన మమ్మల్ని రియల్ ఎస్టేట్ బ్రోకర్లుగా చిత్రీకరిస్తున్నారని మండిపడ్డారు. ఆలూరు వెంకటేష్ ఆలూరు విజయభాస్కర్ కన్స్ట్రక్షన్స్ కు సంబంధించిన సర్వేనెంబర్ 739, 740, 741, 742 ఘట్కేసర్ మండలంలోని కొర్రెముల గ్రామంలో 47 ఎకరాల 25 గుంటల భూమిని 2007లోనే ప్రభుత్వం ద్వారా మ్యుటేషన్ పొందినమని తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏడు ఎకరాల పట్టా పాస్ పుస్తకం ప్రభుత్వం అందచేసిందని తెలిపారు. సర్వేనెంబర్ 743 నుండి 747 వరకు రద్దు చేయబడిన అక్రమ లేవట్లలోని ప్లాట్లను తక్కువ రేటు కొని ప్రజలను మోసగించి ఎక్కువ మొత్తంలో లాభాలను ఆడించిన వ్యక్తులు కుట్రలు పన్ని మా భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొని మా ఆస్తిని, మమ్మల్ని కాపాడాలని విన్నవించుకున్నారు. ఎంపీ ఈటల వాస్తవాలు తెలుసుకోకుండా దాడులకు దిగారని అన్నారు. ఎంపీ అయి ఉండి వీధి రౌడీలా వ్యవహరించి తను దాడి చేసి తన అనుచరులతో విచక్షణ రహితంగా మాపై దాడికి పాల్పడ్డారని అన్నారు. ఈటల దాడిలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయని రక్తస్రావం వచ్చేలా ఈటెల అనుచరులతో దాడికి దిగారని తెలిపారు. కబ్జాలకు పాల్పడుతున్న వారికి ఈటెల రాజేందర్ సహకరిస్తున్నారని అన్నారు. ఈటెల రాజేందర్ పై పోలీసులకు ఫిర్యాదు చేశామని వారు అన్నారు.

## సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌కు గుండెపోటు



సికింద్రాబాద్, వార్త మిర్రర్ జనవరి 21: కుటుంబంతో డెహ్రాడూన్ పర్యటనలో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేఅస్వస్థతకు గురవడంతో ఆసుపత్రికి తరలించిన కుటుంబ సభ్యులుస్టంట్ వేసి... ప్రాణాపాయం లేదని చెప్పిన వైద్యులు సికింద్రాబాద్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత పద్మారావు గౌడ్‌కు గుండెపోటు వచ్చింది. ప్రస్తుతం తన కుటుంబం సహా ఆయన డెహ్రాడూన్ పర్యటనలో ఉన్నారు. ఈ సమయంలో ఆయన అస్వస్థతకు గురయ్యారు.ఆయనకు గుండెపోటు వచ్చిందని గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. పద్మారావు గౌడ్‌ను పరీక్షించిన వైద్యులు స్టంట్ వేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఎలాంటి ప్రాణాపాయం లేదని తెలిపారు.

# ఫిబ్రవరిలో జరిగే బడ్జెట్ సమావేశాల్లోనే ఆశాలకు 18వేల కనీస వేతనం అమలు చేయాలి

**అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యేలు, మంత్రులు ఆశాల గురించి మాట్లాడాలి.. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి డిమాండ్**

నల్లగొండ జిల్లా వార్త మిర్రర్ ప్రతినిధి (ఏలే భాస్కర్) : ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో ఆశా వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ 18 వేల ఫిక్సిడ్ వేతనం నిర్ణయించాలని పీఫ్, ఈ ఎస్ ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని లేదంటే ఆశాలు ఉధృత పోరాటాలకు సిద్ధమవుతారని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పది కిలోమీటర్ల పాదయాత్ర ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ, బిఆర్ఎస్ ప్రభుత్వం ఆశాల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని, ఆశాల వేతనాలు పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని కనీస వేతనం 18వేలు పెంచుతామని కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆశాల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.సిఐటియు నాయకత్వం లో ఆరోగ్యశాఖ మంత్రి, రాష్ట్ర ఉన్నత అధికారులకు ఎమ్మెల్యేలకు,మంత్రులకు, అనేకసార్లు వినతి పత్రాలు ఇచ్చిన సమస్యలు పరిష్కరించలేదని అన్నారు. అందుకోసమే పోరాటాన్ని చేస్తున్నామని వీరారెడ్డి అన్నారు. ఎన్ హెచ్ ఎం స్కీం లో భాగంగా గత 19 సంవత్సరాల నుండి రాష్ట్రంలో ఆశా వర్కర్లు పనిచేస్తున్నారు, వీరంతా బడుగు బలహీన వర్గాలకు చెందిన మహిళలు, రాత్రనకా పగలనకా ఉదయం నుండి రాత్రి వరకు నిరంతరం ప్రజల ఆరోగ్య సేవలు అందిస్తూ డెలివరీల సందర్భంగా రెండు మూడు రోజులు కుటుంబాన్ని వదిలి హాస్పిటల్ వద్ద ఉంటున్నారు.రాష్ట్ర ప్రభుత్వ ఆశాలను ఎట్టి చేయించుకుంటుందని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు చినపాక లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫారసులు మాత్రం అమలు చేయలేదని దీనివల్ల తెలంగాణలతోపాటు దేశవ్యాప్తంగా 10 లక్షల మంది ఆశాలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా కాలంలో ఆశాల శ్రమను గుర్తించిన వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ఆశా వర్కర్లు గ్లోబల్ లీడర్స్ అని ఆశాలకు అవార్డును ప్రకటించింది.కానీ మన కేంద్ర ప్రభుత్వం నేటికీ ఆశాల శ్రమను గుర్తించడానికి సిద్ధపడట్లేదు, పైగా ఎన్ హెచ్ ఎం స్కీంకు బడ్జెట్ ను తగ్గిస్తుంది, కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తెచ్చి సంఘం పెట్టుకునే హక్కు సమ్మె చేసే హక్కు లేకుండా చేసి కార్మిక హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు యం డి సలీమ్, సిఐటియు




జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, మల్లు గౌతమ్ రెడ్డి చింతపల్లి బయన్న నల్ల వెంకటయ్య ఏర్పుల యాదయ్య, జిల్లా నాయకులు పెంజెర్ల సైదులు ,అద్దంకి నరసింహ, పోలే సత్యనారాయణ, భీమ గాని గణేష్, ఆదిమల్ల సుధీర్, వరికుప్పల ముత్యాలు, ధనుంజయ్ ఎల్లయ్య రవీందర్ ఆశ యూనియన్ నాయకులు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పరమేశ్వరి వెంకటమ్మ టీ పార్వతమ్మ, టీ కల్పన, బి మల్లేశ్వరి, కే స్వర్ణ ,ఎర్ర సౌజన్య, ఎస్ విజయ కుమారి, పి ప్రేమలత, పి రాధ, చింత వజ్రమ్మ పాల్గొన్నారు



## శ్రీనివాస కాలనీలో కృష్ణ వాటర్ పైప్ లైన్ పరిశీలన

**రోడ్డుపై నిర్మాణాలు చేపడితే ఉపేక్షించం- పైళ్ళ సుదర్శన్ రెడ్డి**

హయత్ నగర్ వార్త మిర్రర్ ప్రతినిధి : హయత్ నగర్ డిపో రోడ్డు శ్రీనివాస కాలనీలో కాలనీ కమిటీ సభ్యులు కాలనీలోని కృష్ణ వాటర్ పైప్ లైన్లను పరిశీలించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డుపై (అడుగులు) నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని తెలిపారు, కాలనీ కమిటీని సంప్రదించకుండా రోడ్డుపై నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామని హెచ్చరించారు, శ్రీనివాస్ కాలనీ కమిటీ అధ్యక్షులు పైళ్ళ సుదర్శన్ రెడ్డి శ్రీనివాస్ కాలనీ రోడ్డుపై నిర్మాణాలు చేపడితే కాలనీ కమిటీకి నిర్భయంగా ఫిర్యాదు చేయాలని కాలనీ వాసులకు తెలిపారు, ధర్మారెడ్డి, పన్నాల వెంకటరెడ్డి, పిచ్చయ్య, కృష్ణ గౌడ్, లింగం యాదవ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు



## విద్యార్థి చదువుకు ఆర్థిక సాయం అందించిన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్

ఆమనగల్ జనవరి 21 వార్త మిర్రర్ : జంగారెడ్డి పల్లి గ్రామం నిరుపేద కుటుంబానికి చెందిన శైలజ అనే అమ్మాయి బి ఎన్ రెడ్డి కృష్ణవేణి కాలేజీ ఎంపీసీ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న అమ్మాయి ఆర్థిక సమస్యలకు ఇబ్బంది ఉందని ఎంపీపీ నిర్మల శ్రీశైలం గౌడ్ యువ నాయకుడు మల్లేష్ ద్వారా తలకొండపల్లి జెడ్పిటిసి తెలంగాణ రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ గారి దృష్టికి సమస్యను తీసుకపోవడం వల్ల వెంటనే స్పందించి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా శైలజ చదువు కు దూరం కాకూడదని చదువుకోవాలని అమ్మాయికి 25000 వేల రూపాయలు కాలేజ్ యాజమాన్యానికి తన ఆఫీసులో వెంకటేష్ స్నేహితుడైన ఆంజనేయులు గౌడ్ ద్వారా విద్యార్థిని కి చేతులకు చెక్కు అందించారు ఈ కార్యక్రమంలో మల్లేష్ సంపత్ భాస్కర్ కొర్ర కృష్ణ బుచ్చిబాబు పవన్ ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు

# అర్హులైన అందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

**శంకర్‌పల్లి మున్సిపల్ కౌన్సిలర్ సంధ్యారాణి అశోక్‌కుమార్**







శంకర్‌పల్లి: జనవరి 21: (వార్త మిర్రర్): అర్హులైన అందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తామని రెండవ వార్డు కౌన్సిలర్ సంధ్యారాణి అశోక్ కుమార్, కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని గణేష్ నగర్ వార్డులో మంగళవారం నిర్వహించిన ప్రజా పాలన వార్డు సభకు కౌన్సిలర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రజాపాలన వార్డు సభల్లో చదివిన జాబితాల్లో వివిధ పథకాల కింద పేర్లు రాని అర్హులు మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అధికారులు దరఖాస్తులపై తక్షణమే విచారణజరిపి వారిని ఎంపిక చేస్తారని స్పష్టం చేశారు. దరఖాస్తుదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. గత బీఆర్ఎస్ సర్కార్ పదేళ్ల తమ పాలనలో ఒక్కరికి కూడా ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అందించిన పాపాన పోలేదని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు దశల వారిగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం. రూ.500 లకే వంట గ్యాస్, రాజీవ్ ఆరోగ్యశ్రీరూ. 10 లక్షలకు పెంపు, ఇండ్లకు ఉచిత కరెంటు వంటి పథకాలను ఇప్పటికే అమలు చేశామన్నారు. ప్రస్తుతం కొత్తగా ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి సంక్షేమ పథకాలను ఈనెల 26 నుంచి అందిస్తామని తెలిపారు. పూర్తి పారదర్శకంగా లబ్దిదారుల ఎంపిక ఉంటుందన్నారు. ఈ విషయంలో ఎలాంటి అవినీతికి, అనుమానాలకు తావు లేకుండా ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ చంద్రశేఖర్, శ్రీనివాస్, మహేందర్, హరీశ్వర్ రెడ్డి, జోష్ణ, వినోద్, సాయి మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.



## మీసా క్యాలెండర్లు-2025 ఆవిష్కరించిన సబ్ కలెక్టర్ అమిత్, తహసీల్దార్ హరిబాబు

మిర్యాలగూడ , జనవరి 21:- (వార్త మిర్రర్) : తెలంగాణ ముస్లిం ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ (మీసా)-2025 క్యాలెండర్లను స్థానిక సబ్ కలెక్టర్ ఎం. నారాయణ్ అమిత్, తహసీల్దార్ ఎన్.హరిబాబు, మున్సిపల్ కమిషనర్ ఎండీ. యూసుఫ్, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్, సబ్ ట్రెజరీ ఆఫీసర్ లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాలెండర్ ప్రకారం విధులు నిర్వహించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మీసా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎ. జానిపాషా, ఎండీ. అజీముద్దీన్, ఉపాధ్యక్షుడు గులాం దస్తగిర్, అదనపు ప్రధాన కార్యదర్శి సాజిద్ అలీ, సహాధ్యక్షుడు నుస్రత్ ఆలీ, ఎండీ.అహ్మదుల్లా, మెహ్రున్నిసా బేగం, జమాల్, గులాం అహ్మద్, మౌలానా, మొహమ్మద్ బిన్ అబ్దుల్లా, రషీద్, ఫిరోజ్ ఖాన్ పాల్గొన్నారు.

# ఎటువంటి అవినీతి ,అక్రమాలకు పాల్పడలేదు, తనపై ఆరోపణలు నిరాధారం



మిర్యాలగూడ జనవరి 21:-(వార్తమిర్రర్) : అవినీతి, అక్రమాలకు తాను పాల్పడలేదని కావాలని తనపై సురేష్ ఆరోపణలు చేశారని మిర్యాలగూడ మండలం అవంతీపురం గ్రామపంచాయతీ కార్యదర్శి సోమిడి గాయత్రి వివరణ ఇచ్చారు. మంగళవారం మిర్యాలగూడలో విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ట్రాక్టర్, ట్రాలీ రిజిస్ట్రేషన్ కోసం సంబంధిత పత్రాలు మాజీ ఎంపిటీసి భర్త అయిన ఆర్టీఏ ఏజెంట్ సురేష్ రిజిస్ట్రేషన్ చేయిస్తానని చెప్పి తన వద్దే ఉంచుకున్నారని, రిజిస్ట్రేషన్ కోసం డిడి సిద్ధంగా ఉంచుకున్నాని ఆమె తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలో సర్వేనంబర్ 628 లో ప్రభుత్వ భూమి ఉందని మొత్తం 2015-16 రివిజన్ రికార్డు ప్రకారం రికార్డులు నిర్వహిస్తున్నామని తెలిపారు. రికార్డు మార్చడానికి, జనన మరణ ధృవీకరణ పత్రాలు, మ్యారేజ్ సర్టిఫికేట్స్ ఇవ్వడానికి డబ్బులు తీసుకుంటునన్న ఆరోపణలు నిరాధారమని, వాస్తవం లేదని అన్నారు. 2 సంవత్సరాల క్రితం పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి కొత్తగా లే ఔట్లు చేయలేదని అయిన తనపై ఆరోపణలు చేశారని ఆమె చెప్పారు. తను విధులలో చేరినప్పటి నుంచి చెప్పినట్లు చేయాలని, గ్రామ పంచాయతీ నిధుల నుంచి పనులు ఇవ్వాలని, ఆయన ఖాళీ భూమి రికార్డుల్లో నమోదు చేయాలని కోరారని ఆమె అన్నారు. తనను మానసికంగా వేధించారని ఆమె తెలిపారు. స్పెషల్ ఆఫీసర్ పీరియడ్ నుండీ తాను చెప్పినట్లు చేయాలని లేకుంటే గ్రామ ప్రజలతో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసి సస్పెండ్ చేయిస్తానని, దూర ప్రాంతానికి బదిలీ చేయిస్తానని, మనోభావాలను దెబ్బ తినే విధంగా తన అనుచరులతో ఒక మహిళా ఉద్యోగి అని చూడకుండా వాట్స్ యాప్ గ్రూపులో పోస్టులు అవమానకరంగా పెట్టించారని ఆరోపించారు. నన్ను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఎలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడలేదని ఉన్నతాధికారుల విచారణకు సిద్ధమని ఆమె తెలిపారు.

## గ్రామ సభలను పకడ్బందీగా నిర్వహించాలి

**ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందడమే కాంగ్రెస్ లక్ష్యం -కాంగ్రెస్ నేత ఉప్పల లింగస్వామి**



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి గ్రామసభలు పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు కాంగ్రెస్ మండల నాయకులు ఉప్పల లింగస్వామి, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటికి అందడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు, ప్రభుత్వ ఆదేశాల మేరకు 4 పథకాలకు సంబంధించిన విధి విధానాలను గ్రామసభల్లో ప్రజలకు వివరించి జాబితాను చదివి అర్హులైన ప్రతి ఒక్కరిని ఎంపిక చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఉప్పల లింగస్వామి

# 6 గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

**కాంగ్రెస్ పార్టీకి స్థానిక ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు- డాక్టర్ ర్యాకల శ్రీనివాస్**



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) :కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేని హామీలతో అధికారంలోకి వచ్చి సంవత్సరం ప్రకటనలతో కాలయాపన చేస్తుందని అన్నారు, బిఆర్ఎస్ జిల్లా నాయకులు, డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, రాబోయే స్థానిక ఎన్నికల్లో లబ్ధి పొందడానికి రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు, తెల్ల రేషన్ కార్డులు అంటూ తెలంగాణ ప్రజలను మోసం చేయడానికి గ్రామ సభల పేరుతో ప్రభుత్వం ముందుకు వస్తుందని అన్నారు, ప్రతి ఇంటికి 2500/రూపాయలు, కళ్యాణ లక్ష్మి తులం బంగారం, విద్యార్థినిలకు స్కూటీలు, 6 గ్యారెంటీలను పూర్తిగా అమలు చేసి, స్థానిక ఎన్నికల్లో దిగాలని అన్నారు, బీసీలకు 42% శాతం రిజర్వేషన్లు కల్పించి స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామన్న కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు బీసీలకు సమాధానం చెప్పాలని అన్నారు, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డిగ్రీ కళాశాలకు ఫీజు రియంబర్స్మెంట్ అందించకుండా కాలేజీలు మూసేసిన గాని ప్రభుత్వానికి చలనం లేదని ఆరోపించారు, కాంగ్రెస్ ప్రభుత్వానికి సరైన సమాధానం రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్తారని అన్నారు, బిఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్

## ఈనెల23న చేనేత, పవర్ లూమ్ కార్మికుల కలెక్టరేట్ లముందు నిరసనలు జయప్రదం చేయండి

**: తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్**



నల్గొండ జిల్లా వార్తా మిర్రర్ ప్రతినిధి (ఏలే భాస్కర్) : చేనేత పవర్ లూమ్ కార్మికుల వృత్తి రక్షణ, వృత్తిదారుల సంక్షేమం కోసం ఈ నెల 23నుండి 31వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల ముందు నిరసనలను జయప్రదం చేయాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ పిలుపునిచ్చారు. మంగళవారం దొడ్డి కొమురయ్య భవన్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చేనేత, పవర్లూమ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా 23 నుండి 31 వరకు అన్ని జిల్లా కలెక్టరేట్ల ముందు నిరసన కార్యక్రమాలలో భాగంగా జనవరి 23న నల్గొండ జిల్లా కలెక్టరేట్ ముందు నిరసన, అనంతరం జిల్లా కలెక్టర్కు వినతి పత్రం ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. చేనేత పరిశ్రమ అభివృద్ధి కోసం, కార్మికుల సంక్షేమం కోసం చేనేత బోర్డు ఏర్పాటు చేసి బడ్జెట్లో 1000 కోట్లు రూపాయలు కేటాయించాలని డిమాండ్ చేశారు. పవర్లూమ్ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తూ పవర్లూమ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, కార్మికుడిని యజమానిగా చేసే వర్కర్ టు ఓనర్ పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని, చేనేత, పవర్ లూమ్ కార్మికుడికి ఐదు లక్షల రూపాయల పెట్టుబడి సహాయం అందించాలని, ఇల్లు లేని చేనేత కార్మికులకు హౌస్ కం వర్క్ షెడ్ పథకాన్ని పునరుద్ధరించాలని, చేనేత సహకార సంఘాల్లో నిల్వ ఉన్న చేనేత వస్త్రాలను టెస్కో ద్వారా కొనుగోలు చేసి నిధులు విడుదల చేయాలని, లక్ష రూపాయలు వరకు చేనేత , పవర్ లూమ్ కార్మికులకు రుణమాఫీ చేయాలని , అర్హులైన కార్మికులందరికీ రేషన్ కార్డులు, పెన్షన్లు ఇవ్వాలని గంజి మురళీధర్ డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో చేనేత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో జరిగే పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, అధ్యక్షులు గంజి నాగరాజు, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కందగట్ల గణేష్, నాయకులు కర్నాటి శ్రీరంగం, సురపల్లి భద్రయ్య, రాపోలు వెంకన్న, గడ్డం దశరథ తదితరులు పాల్గొన్నారు.



## డా, ర్యాకల శ్రీనివాస్ కు కీ.శే జిట్టా బాలకృష్ణారెడ్డి మెమెంటో అందజేసిన-జిట్టా బాలకృష్ణారెడ్డి అభిమానులు

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : బిఆర్ఎస్ జిల్లా నాయకులు, సామాజికవేత్త, డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ కు కీ,శే జిట్టా బాలకృష్ణారెడ్డి మెమెంటోని అందజేసిన, జిట్టా బాలకృష్ణారెడ్డి అభిమాన సంఘం నాయకులు, ఈ సందర్భంగా డా, ర్యాకల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం సాగించిన నాయకుడు, తెలంగాణ సాధన లక్ష్యంగా యువతను సంఘటితం చేసి మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కీ,శే జిట్టా బాలకృష్ణారెడ్డి మెమెంటోను అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు, బిఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్